క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం పరిధిలో హై టెన్షన్ లైన్ల నిర్వహణలో భాగంగా చేపడుతున్న పలు నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్, అబిడ్‌నగర్, షాదీఖానా, కేంద్రీయ విద్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, కార్మిక కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి కూడలి పరిధి జైభారత్‌నగర్, పల్నాటికాలనీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం వార్డు కార్పొరేటర్ గంకల కవిత పరిశీలించారు. మెట్ల మార్గాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్లను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు గంకల అప్పారావు, ఉమామహేశ్వరరావు, శకుంతల, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాల తరలింపు

సీతమ్మధార : ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సమీప ఖాళీ ప్రదేశాలకు తరలించారు. ద్విచక్ర వాహనాలు,కార్లు, ఆటోలను తరలించినట్టు సీఐ విజయకుమార్ తెలిపారు. స్టేషన్ ఆవరణలో వాహనాలు పేరుకుపోవడంతో ఫిర్యాదుదారులకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వాహనాలను తరలించినట్టు చెప్పారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన వారికి టేబుళ్లు కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ షణ్ముఖరావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో 'బుల్లయ్య కళాశాల' ప్రతిభ

సీతంపేట: ఆంధ్రాయూనివర్సిటీ అంతర కళాశాలల వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలో బుల్లయ్య కళాశాల పురుషుల జట్టు, మహిళల జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జి. మధుకుమార్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా బుల్లయ్య కళాశాల జట్టు నిర్విరామంగా చాంపియన్‌షిప్‌ను గెలవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి, అసిస్టెంట్ డీన్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డి.దీనబంధు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎన్.గురివినాయుడు, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, యు.గంగాభవాని పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో తప్పిదాలుంటే సరిదిద్దుతాం

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ఓటర్ల లిస్టులలో తప్పిదాలు ఉంటే సరిదిద్దుతామని సీతమ్మధార తహసీల్దార్ ఎం.ఆనందకుమార్ అన్నారు. మంగళవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈఆర్వో అఖిల హాజరయ్యారు. బీజేపీ తరుపున మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వైఎస్సార్ సీపీ తరుపున నాయుడు, నీలి రవి, బీఎస్పీ తరుపు ముద్దడ భాగ్యలక్ష్మి హాజరయ్యారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

సీతమ్మధార : చింతగట్ల గ్రామ సర్పంచ్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అయ్యారక సంఘం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వం, పోలీసులు ఇలాంటి ఘటనలు జరగకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యారక కార్పొరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్. రాజశేఖర్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర అధ్యక్షుడు తెంక రామన్నపాత్రుడు, కర్రి శ్రీను, వరహాలు, బెహరా త్రినాథస్వామి, లంక శ్రీను పాల్గొన్నారు.

కొండవాలు..అభివృద్ధికి ఆనవాళ్లు


శాంతినగర్‌లో నిర్మిస్తున్న సామాజిక భవనం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ (ఫైల్)

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాసపురం కొండవాలు ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతులు పూర్తిగా సమకూరాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొండవాలు ప్రాంతాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. అనంతరం వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కొండవాలు ప్రాంతాలను దశలవారీగా అభివృద్ధి చేసింది. దీంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్డు పరిధంతా కొండవాలు ప్రాంతంగా ఉండడంతో మౌలిక వసతులు కల్పించడానికి కష్టతరంగా ఉండడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్లలో శాంతినగర్, మధుసూదనగర్, కైలాసపురం, సంతోషనగర్, సూరిబాబునగర్, లక్ష్మీనారాయణపురం, కస్తూరినగర్–1,2, ప్రాంతాల్లో రెండేళ్లలోనే సుమారు రూ.5.28 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగాయి. ఇక్కడ సమస్యలను కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్.. జీవీఎంసీ కమిషనర్, నగర్ మేయర్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు, పార్టీ నేతల సహకారంతో వార్డు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం సుమారు రూ.1.8 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు, సామాజిక భవనాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వార్డులో శుభకార్యాలు, మరే ఇతర వేడుకలు జరుపుకోవాలన్నా దిగువ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి కనిపించేది. నేటితో అలాంటి సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించింది. వార్డులో సమస్యల పరిష్కారం కావడం, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

46వ వార్డు కొండవాలులో అభివృద్ధి పనులు ఇలా

ప్రాంతాలు	పనులు	నిధులు
కస్తూరినగర్	అంగన్వాడీ భవనం	రూ.7లక్షలు
శాంతినగర్	కళావేదిక	రూ.36లక్షలు
శాంతినగర్	కమ్యూనిటీ హాల్	రూ.15లక్షలు
సంజీవయ్యకాలనీ	సామాజిక భవనం	రూ.35లక్షలు
కస్తూరినగర్	కమ్యూనిటీహాల్	రూ.25లక్షలు

కొండవాలులో అభివృద్ధి జోరు..



కొండవాలు ప్రాంతాలను అభివృద్ధి చేయడం ఎంతో కష్టతరంతో కూడిన పని. ప్రజలకు మౌలిక వసతులు అందించాలన్నదే నా ధ్యేయం. ప్రభుత్వం, ఎంపీ, జీవీఎంసీ నుంచి నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. స్మార్ట్ వార్డ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రజల సహకారం కావాలి. కొండవాలులో సామాజిక భవనాలు, కమ్యూనిటీ హాల్‌లు నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుని విశేష అభివృద్ధిని సాధిద్దాం.

– కటుమూరి సతీష్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ జగనే సీఎం కావాలి

ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు


ఎంటీసీ పాలెంలో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు


కన్వీనర్లకు కిట్ అందజేస్తున్న కె.కె.రాజు

సీతంపేట: దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఎన్నికల మ్యానిఫెస్టోలో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 44వ వార్డు కార్పొరేటర్, మండలాధ్యక్షులు బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంటీసీపాలెం(238) సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిపనుల వివరాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పేద, బడుగు,బలహీన వర్గాల సంక్షేమం, మేలు కోరే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని అన్నారు. అవినీతికి తావులేకుండా, నిష్పక్షపాతంగా నవరత్నాల పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గతంలో నాలుగు ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉండేవని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మరో ఆరు కొత్త పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించి పేద ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేశారన్నారు. ఎంటీసీపాలెం సచివాలయ పరిధిలో 33 సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.23కోట్ల విలువైన నగదు ప్రత్యక్షంగా,పరోక్షంగా లబ్ధిదారులకు బదిలీ జరిగిందన్నారు. పేదల మేలు కోసం నిత్యం శ్రమించే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి గెలిపించి మన భవిష్యత్‌కు మనమే బంగారు బాట వేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రజలు, మహిళలు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, 44వ వార్డు నాయకులు హబీబ్, హీరా, ముస్తఫా, బషీర్, జ్యోతి, సీతారాములు, సుధాకర్ రెడ్డి, ప్రసాద్, పి.గోపి, యం.గోపి, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కేకే రాజు, వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: గడపగడపలో సంక్షేమం అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 50వ వార్డు 294 సచివాలయం పరిధి వుడా కాలనీ మాధవధార ప్రాంతంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో నేరుగా తెలుసుకునేందుకు, వినతులు తీసుకునేందుకు వీలుగా ప్రజల్లో మమేకమవ్వడానికే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టర్,వార్డు అధ్యక్షురాలు సునీత, జిల్లా నాయకులు ఆళ్ళ శివగణేష్, లక్ష్మి, శ్రీనివాసరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 50వ వార్డు నాయకులు, వలంటీర్లు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గోవర్ధన పూజ

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధిలోని కోదండ సీతారామ స్వామి, సంపత్ వేంకటేశ్వర స్వామి, దుర్గా ధనలక్ష్మీదేవి ఆలయాల్లో మంగళవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గోవర్ధన పూజలను ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవతా మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం గోమాత ప్రదక్షిణ, విశేష హారతి నిర్వహించారు. ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శ్యామ్‌శర్మలు గోమాతకు పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 40 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని జీఆర్పీ సిబ్బంది అరెస్టు చేశారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందితో ప్లాట్‌ఫారాలను తనిఖీలు నిర్వహించారు. హర్యానాకు చెందిన కిషన్, సంజయ్ బ్యాగులను తనిఖీ చేయగా 40 కేజీల గంజాయిని పట్టుబడింది. వీరు ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి హర్యానాకు గంజాయి తరలిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు (డీఎస్ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి


క్విజ్ పోటీ విజేతలతో జీఎస్ఎన్ రాజు, డీఎస్ వర్మ

సీతంపేట: విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్.రాజు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. పౌర గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న డి.ఎస్.వర్మను అభినందించారు. క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు టి.ఆర్.ఎస్.ప్రసాద్, కార్యదర్శి డి.ఎస్.వర్మ, సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు, గ్రంథపాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


సీతంపేట పార్వతీశ్వరాలయంలో ఆకాశ దీపం ఏర్పాటు చేస్తున్న భక్తులు

సీతంపేట: దేవాదాయశాఖ పరిధిలోని శివాలయాలలో మంగళవారం తెల్లవారు జామునుంచి కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 25వ వార్డు సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయాలలో తెల్లవారుజామున శివలింగాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపి పూజలు ప్రారంభించారు. సాయంత్రం ఆలయాలలో ధ్వజ స్తంభం వద్ద ఆకాశదీపం ఏర్పాటు చేశారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీశ్వరునికి మేళ తాళాలతో ప్రత్యేక హారతులు ఇచ్చారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సీతమ్మధార: సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లో మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఈవో శేఖర్‌బాబు పాల్గొన్నారు.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్‌లలో మంగళవారం ప్రత్యేక భద్రతా తనిఖీలను నిర్వహించారు. ప్రత్యేకంగా కంటకాపల్లి–అలమండ సెక్షన్‌లో కీలక ప్రాంతాలలో ప్యానల్ రూంలను, రిలే రూంలను, ఇంటర్‌లాకింగ్ సిస్టంలను, అగ్ని ప్రమాద భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సెక్షన్‌లో ఇటీవల ప్రమాదానికి గురైన స్థలాన్ని పరిశీలించారు.

అప్పు తీర్చమన్నందుకు దాడి

మద్రిపాలెం: కొంతకాలం క్రితం స్నేహితురాలికి కుటుంబ అవసరాల కోసం కొంత నగదు ఇచ్చింది. తిరిగి అడిగినందుకు కులంపేరు దూషించి, కుటుంబ సభ్యులతో దాడికి పాల్పడింది. దీంతో బాధిత మహిళ ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా...కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న గండి రాజేశ్వరి..దుర్గానగర్‌లో ఉంటున్న తన స్నేహితురాలు కర్రి శ్రీదేవికి రెండేళ్ల క్రితం కొంత నగదు ఇచ్చింది. రెండేళ్లయినా తిరిగి ఇవ్వడం లేదు. అప్పు తీర్చమని ఇటీవల రాజేశ్వరి అడిగింది. అక్కడ శ్రీదేవి స్నేహితురాలు బంగారి సత్యవేణి కూడా ఉంది. డబ్బులు ఇవ్వాలని శ్రీదేవిని నిలదీయగా..సత్యవేణి కల్పించుకుని తాను హ్యూమన్‌రైట్స్‌లో పనిచేస్తున్నానని, తనకు పోలీసులు బాగా తెలుసునని రాజేశ్వరిని బెదిరించింది. అంతేకాక ఇద్దరు కలిసి కులం పేరుతో దుర్భాషలాడారు. శ్రీదేవి సోదరుడు రాము రాజేశ్వరిపై చేయి చేసుకున్నాడు. దీంతో శ్రీదేవి, ఆమె కుటుంబ సభ్యులు, సత్యవేణిపై కంచరపాలెం పోలీసులకు రాజేశ్వరి ఫిర్యాదు చేసింది.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు


జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు, అశోక్‌కుమార్


చిన్నారులతో డాన్‌బాస్కో సిబ్బంది


51వ వార్డు ఈస్ట్‌పార్కులో చిన్నారులతో రెయ్యి వెంకటరమణ


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార : నక్కవానిపాలెంలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు హాజరయ్యారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికిన విషయాన్ని గుర్తుచేశారు. నాడు–నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపాంతరం చెందాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పూర్ణచంద్రరావు, నాయకులు సీతాకుమారి, బాచి, గురు, చలపతి, ప్రకాష్, కృష్ణారెడ్డి, అప్పలరెడ్డి, రమేష్ దేవి, శాంతి పాల్గొన్నారు.

ఏఎస్ఆర్ నగర్‌లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం దరి ఏఎస్ఆర్ నగర్‌లో డాన్‌బాస్కో సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. డాన్ బాస్కో సంస్థ ఫాదర్ కల్యాణ్, కో ఆర్డినేటర్ రాంబాబు, ఏఎస్ఆర్ నగర్ సెక్రటరీ ఎన్.సతీష్, ఉపాధ్యాయులు కల్యాణి, రమ పాల్గన్నారు.

సీతమ్మధార : ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ మనోజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.ఈకార్యక్రమంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ కరస్పాండెంట్ జోసఫ్, వర్గీస్, మాస్టర్ సుధాకర్, శాంతి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు

సీతంపేట: బాలల దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్‌కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ప్లాన్ ఇండియా ఎన్జీవో ఆర్గనైజేషన్ విద్యార్థులకు 'డిజిటల్ ఎడ్యుకేషన్ దాని ఆవశ్యకత' అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో 9వ తరగతి విద్యార్థి ఇమ్రాన్ ప్రథమ స్థానం, 8వ తరగతి విద్యార్థులు జ్యోత్స్నారామ్ ద్వితీయ బహుమతి, దీక్షిత ప్రవల్లిక తృతీయ బహుమతి సాధించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ప్లాన్ ఇండియా కంప్యూటర్ రిసోర్స్ పర్సన్ యు.అశోక్‌కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

మద్రిపాలెం: జాతీయ బాలల దినోత్సవ సందర్భంగా చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్‌పార్కులోని మహిళా వాకర్స్ క్లబ్ (మాధవధార) అధ్యక్షురాలు శేషమణి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ వేషధారణల్లో చిన్నారులు అలరించారు. పార్కు ప్రెసిడెంట్ మురళీకృష్ణ,సెక్రటరీ ప్రసాద్, మాధవమురళీ స్కూల్ కరస్పాండెంట్ మురళీధర్ ,మహిళా వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

53వ వార్డులో..

జీవీఎంసీ 53వ వార్డు పార్వతీనగర్ వద్ద వున్న అన్నూర్ ప్లేస్కూల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

పంచవర్ష ప్రణాళికల రూపకర్తకు వందనం

మురళీనగర్: భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలను రూపొందించి దేశాభివృద్ధికి నాంది పలికిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిరస్మరణీయుడని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో మంగళవారం నెహ్రూ జయంతిని నిర్వహించారు. పూర్వాధ్యక్షులు ఎం.భాస్కరరావు, ఏవీ సుబ్బారావు, ఎన్. బుచ్చయ్య, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, జాలీ వాకర్ ఎస్. ప్రకాశరావు, పూర్వాధ్యక్షులు సీహెచ్ కృష్ణమూర్తి, సత్తి సునీల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పి.చెల్వరాజు, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మురళీనగర్ గ్రంథాలయంలో..

మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో చాచా నెహ్రూ జయంతి సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మాధవధార ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పెద్దినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ, రిటైర్డ్ హెచ్‌ఎం భాస్కరరావు, టీచర్ శశికళ, రామారావు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువులకు ప్రాధాన్యమివ్వాలి

మాధవధార ప్రాథమిక పాఠశాలలో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలలదినోత్సవాన్ని నిర్వహించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101గవర్నర్ ఉప్పలపాటి శుభ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పెద్దినాయుడు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ, ఉపాధ్యక్షురాలు పి.ప్రభావతి, కార్యదర్శి రోజారాణి, సలహాదారు బిందురాణి, ఉపకార్యదర్శి పద్మావతి, ఉప కోశాధికారి భానుమతి, జాలీ వాకర్ ప్రమాశారావు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన కేకే రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ ఉత్తరనియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బాధితుల నుంచి పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను తక్షణం పరిష్కరించగా..మరికొన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

మానసిక ఆస్పత్రికి బీపీ మెషీన్ల వితరణ

సీతంపేట: జీవీఎంసీ 25వవార్డు సీతంపేటకు చెందిన శ్రీయశోద కృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో మానసిక వైద్యశాల సూపరింటిండెంట్‌కు మంగళవారం రూ.10వేల విలువచేసే బీపీ మిషన్లు వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. 20వవార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్, ముద్దాడ శంకర్, యల్లాజీరావు పాల్గొన్నారు.